# ఇందూరులో.. బీజేపీ విజయం




**నిజామాబాద్** లోక్‌సభ స్థానంలో బీజేపీ వరుసగా రెండోసారి గెలుపొందింది. జహీరాబాద్‌లో కాంగ్రెస్ విజయం సాధించింది. ఎన్నికల ముందర బీఆర్‌ఎస్‌ను వీడి బీజేపీలో చేరిన సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్‌కు ఓటర్లు షాక్ ఇచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్‌కు పట్టం కట్టారు. ఇక ఇందూరులో సిట్టింగ్ ఎంపీ అర్వింద్ మోదీ హవాలో వరుసగా రెండోసారి విజయతీరాలకు చేరారు. 1.09 లక్షల ఓట్ల మెజార్టీతో ఆయన కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిపై విజయం సాధించారు.

- పార్టీ మారిన పాటిల్‌కు షాక్ ఇచ్చిన ఓటర్లు
- ప్రశాంతంగా ముగిసిన కౌంటింగ్ ప్రక్రియ
- మోదీ హవాతో విజయతీరాలకు అర్వింద్
- లక్ష ఓట్లకు పైగామెజార్టీతో గెలుపు



రిటర్నింగ్ అధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు నుంచి గెలుపు ధ్రువీకరణపత్రం అందుకుంటున్న అర్వింద్

డిచ్‌పల్లి/ఖలీల్‌వాడి, జూన్ 4: నిజామాబాద్ పార్లమెంట్ స్థానాన్ని బీజేపీ నిలబెట్టుకున్నది. సిట్టింగ్ ఎంపీ అర్వింద్ లక్షకు పైగా ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. కాంగ్రెస్ రెండు, బీఆర్‌ఎస్ మూడో స్థానానికి పరిమితమయ్యాయి. నిజామాబాద్, జహీరాబాద్ లోక్‌సభ స్థానాలకు గత నెల 13న ఎన్నికలకు జరిగిన సంగతి తెలిసిందే. నిజామాబాద్‌కు సంబంధించి డిచ్‌పల్లిలోని సీఎంసీలో మంగళవారం కౌంటింగ్ నిర్వహించారు. కట్టుదిట్టమైన భద్రత నడుమ నిర్వహించిన ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.

**వ్యతిరేకతను అధిగమించి..**

నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో ధర్మపురి అర్వింద్ తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. సమీప ప్రత్యర్థి జీవన్‌రెడ్డిపై 1,09,241 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. అర్వింద్‌కు 5,92,318 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి 4,83,077 ఓట్లు వచ్చాయి. 1,02,406 ఓట్లతో బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ మూడో స్థానంలో నిలిచారు. బీజేపీ గెలుపుతో పార్టీ శ్రేణులు సంబురాల్లో మునిగిపోయాయి. వాస్తవానికి ఎన్నికల ముందర అర్వింద్‌పై ప్రజల్లోనే కాదు, సొంత పార్టీలోనూ తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. కానీ, మోదీ చరిష్మాతో ఆయన గట్టెక్కారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

**రెండో స్థానానికే కాంగ్రెస్..**

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ రెండో స్థానానికే పరిమితమైంది. ఈవీఎంలతో పాటు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు సైతం బీజేపీకే ఎక్కువగా పడ్డాయి. మొదటి నుంచీ ఆ పార్టీకి మెజార్టీ కనిపించినా, కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు ఎక్కువగా ఓట్లు రావడంతో ఉత్కంఠ నెలకొన్నది. మధ్యాహ్నం తర్వాత స్పష్టత రావడంతో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి కౌంటింగ్ మధ్యలోనే వెళ్లిపోయారు.

**మోదీ టీం విజయమిది..**

నిజామాబాద్‌లో బీజేపీ గెలవడం మోదీ కుటుంబ విజయమని ఆ పార్టీ అభ్యర్థి అర్వింద్ అన్నారు. గెలుపొందిన అనంతరం ఆయన కౌంటింగ్ కేంద్రం వద్ద విలేకరులతో మాట్లాడారు. తన విజయం మోదీ టీమ్ విజయమని, భారతమాత గెలుపని అన్నారు. మోదీ గెలుపు కోసం కష్టపడిన బూత్ స్థాయి కార్యకర్తలు, నాయకులు, ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు తెలిపారు. వెంట నిలిచిన యువతకు, మహిళలకు, రైతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



కౌంటింగ్ కేంద్రం నుంచి నిరాశతో వెనుదిరుగుతున్న కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి

**ప్రశాంతంగా కౌంటింగ్**

పార్లమెంట్ ఎన్నికల్లో చివరి అంకమైన ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. నిజామాబాద్ లోక్‌సభ పరిధిలోని ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో పోలైన ఓట్లను సీఎంసీ మంగళవారం లెక్కించారు. రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు నేతృత్వంలో జగిత్యాల కలెక్టర్ యాస్మిన్ భాషా, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రైనీ కలెక్టర్ సంకేత్‌కుమార్, ఇతర ఉన్నతాధికారులు కౌంటింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్, లలిత్ కుమార్ ఓట్ల లెక్కింపును పరిశీలించారు. ఉదయం 5 గంటల నుంచే కౌంటింగ్ కోసం సన్నాహాలు చేపట్టారు. ఎన్నికల పరిశీలకులు, అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో కలెక్టర్ నేతృత్వంలో కౌంటింగ్ సిబ్బంది 3వ ర్యాండమైజేషన్ నిర్వహించి ఆ జాబితా ప్రకారంగా సిబ్బందికి ఆయా టేబుళ్ల వద్ద ఓట్ల లెక్కింపు బాధ్యతలు కేటాయించారు. మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించగా, అనంతరం ఈవీఎంలలో నమోదైన ఓట్లను లెక్కిస్తూ రౌండ్లవారీగా ఫలితాలను వెల్లడించారు. బీజేపీ అభ్యర్థి అర్వింద్ 1,09,241 ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్లు కలెక్టర్ ప్రకటించారు. నోటాకు 4440 ఓట్లు పోల్ అయ్యాయన్నారు. మొత్తం 7,780 పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో 414 ఓట్లు వివిధ కారణాలతో చెల్లుబాటు కాలేదని వివరించారు. మధ్యాహ్నం 3గంటల వరకు ఓట్ల లెక్కింపు పూర్తి కాగా..గెలుపొందిన ధర్మపురి అర్వింద్‌కు పరిశీలకుల సమక్షంలో కలెక్టర్ ధృవీకరణ పత్రాన్ని అందజేశారు.



**భారీ బందోబస్తు**

కౌంటింగ్ కేంద్రంతోపాటు పరిసర ప్రాంతాల్లో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసి 144 సెక్షన్ నిషేధాజ్ఞలు అమలు చేశారు. కౌంటింగ్ కేంద్రం లోనికి ఇతరులెవరినీ అనుమతించలేదు. కౌంటింగ్ సిబ్బందితోపాటు వివిధ బాధ్యతలు నిర్వర్తించిన సిబ్బందికి ఎంట్రీ పాసులు జారీ చేసినప్పటికీ వారిని సైతం క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి పంపించారు. సెల్‌ఫోన్లు, వీడియోలు, కెమెరాలను నిషేధించారు. పోలీసు బందోబస్తును సీపీ కల్మేశ్వర్ సింగేనవార్ పర్యవేక్షించారు. ఎన్నికలు సాఫీగా ముగించడంలో సహకరించిన వారికి రిటర్నింగ్ అధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు కృతజ్ఞతలు తెలిపారు.

**నిజామాబాద్** — గత, ప్రస్తుత ఎన్నికల్లో పార్టీల వారీగా నమోదైన ఓట్లు

| పార్టీ | 2019 | 2024 |
|---|---|---|
| బీజేపీ | 4,80,584 | 5,92,318 |
| కాంగ్రెస్ | 69,240 | 4,83,077 |
| బీఆర్‌ఎస్ | 4,09,709 | 1,02,406 |

**జహీరాబాద్** — గత, ప్రస్తుత ఎన్నికల్లో పార్టీల వారీగా నమోదైన ఓట్లు

| పార్టీ | 2019 | 2024 |
|---|---|---|
| బీజేపీ | 138947 | 4,76,023 |
| కాంగ్రెస్ | 428015 | 5,23,919 |
| బీఆర్‌ఎస్ | 434244 | 1,71,412 |

## జహీరాబాద్‌లో కాంగ్రెస్ గెలుపు

సంగారెడ్డి జూన్ 4(నమస్తే తెలంగాణ): జహీరాబాద్ పార్లమెంట్‌ను కాంగ్రెస్ కైవసం చేసుకున్నది. కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్ 47,896 ఓట్ల మెజార్టీతో సమీప బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్‌పై విజయం సాధించారు. జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతం యూనివర్సిటీలో నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్‌కు 5,23,919 ఓట్లు వచ్చాయి. బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్‌కు 4,76,023 ఓట్లు సాధించారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు 1,71,412 ఓట్లు వచ్చాయి. సమీప బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్‌పై కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేశ్ షెట్కార్ 47,896 ఓట్ల మెజార్టీతో ఎంపీగా గెలుపొందారు. ఓట్ల లెక్కింపు ప్రారంభమైన మొదటి రౌండ్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి అధిక్యతను కనబరుస్తూ వచ్చారు. ఎన్నికల్లో ఆశించిన ఫలితం రాకపోవడంతో బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ ఓట్ల లెక్కింపు పూర్తి కాకముందే పోలింగ్ కేంద్రం నుంచి అసంతృప్తిగా వెళ్లిపోయారు. ఉదయం 8గంటలకు ప్రారంభమైన ఓట్ల లెక్కింపు రాత్రి 7గంటల వరకు కొనసాగింది. 7గంటల తర్వాత ఎన్నికల అధికారి వల్లూరు క్రాంతి కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్ గెలుపొందినట్లు ప్రకటించారు. సురేశ్ షెట్కార్ తన కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి జిల్లా ఎన్నికల అధికారి వల్లూరు క్రాంతి నుంచి ఎంపీ ఎన్నికల్లో గెలుపు ధృవీకరణ పత్రాన్ని అందుకున్నారు.



సంగారెడ్డిలో గెలుపు ధ్రువీకరణపత్రంతో కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్

# ఓడినా ప్రజల మధ్యే ఉంటా..

- నాకోసం శ్రమించిన వారందరికీ కృతజ్ఞతలు
- ఉత్తర భారతదేశంలో మోదీపై భ్రమలు తొలిగాయి
- దక్షిణ భారతంలోనూ త్వరలోనే వాస్తవాలు తేటతెల్లం
- కాంగ్రెస్ పార్టీ వల్లే బీజేపీ గెలిచిందన్న బాజిరెడ్డి గోవర్ధన్



నిజామాబాద్, జూన్ 4(నమస్తే తెలంగాణ ప్రతినిధి): నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ ఓటమిపై బాజిరెడ్డి గోవర్ధన్ స్పందించారు. ఉద్యమ పార్టీగా బీఆర్‌ఎస్‌కు గెలుపోటములు సర్వసాధారణమని కార్యకర్తలెవ్వరూ అధైర్యపడొద్దని సూచించారు. గడిచిన రెండు నెలలుగా తన గెలుపు కోసం రాత్రింబవళ్లు కృషి చేసిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్మన్లు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలందరికీ ధన్యవాదాలని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ గెలుపు కోసం ప్రతిఒక్కరూ తమ స్థాయిలో కష్టపడ్డారని గుర్తుచేశారు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చెప్పిన అబద్ధాలు, అసత్యాలు పని చేశాయన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నిజాయతీగా ప్రజల ముందుకు వచ్చిందన్నారు. రెండు జాతీయ పార్టీలు చెప్పిన మాటలను ప్రజలు నమ్మాల్సి వచ్చిందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ దురదృష్టం కొద్దీ ఓడిపోయిందన్నారు. ఈ ఓటమితో ఎవ్వరూ కుంగిపోవద్దని బాజిరెడ్డి గోవర్ధన్ సూచించారు. మరో ఎన్నికల్లో సత్తా చాటేందుకు గులాబీ సైన్యం సంసిద్ధులై ఉండాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో తనకు పోటీ చేసేందుకు అవకాశం కల్పించిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు బాజిరెడ్డి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

**మోదీపై భ్రమలు పోతున్నాయ్...**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై దేశ వ్యాప్తంగా ప్రజల్లో ఆదరణ తగ్గుతోందని బాజిరెడ్డి గోవర్ధన్ చెప్పారు. ఇందుకు సార్వత్రిక ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. ఉత్తర భారతదేశంలో బీజేపీ చేష్టలను, వారి పనితీరును గుర్తించి తన్ని తరిమి వేశారన్నారు. ఉత్తరప్రదేశ్‌లాంటి రాష్ట్రంలో బీజేపీకి ఆశాభంగం అయ్యిందన్నారు. ఉత్తర భారతీయులందరికీ మోదీపై భ్రమలు తొలిగిపోయాయని అందుకు ఈ ఎన్నికలే రుజువు చేశాయని చెప్పారు. అతి త్వరలోనే దక్షిణ భారతదేశంలోనూ మోదీపై భ్రమలు తొలిగిపోయే పరిస్థితులు వస్తాయన్నారు. కాస్త సమయమైతే బీజేపీ నిజస్వరూపం దక్షిణాదిలోనూ తేటతెల్లం అవుతుందన్నారు. బీఆర్‌ఎస్ వల్లే బీజేపీ గెలిచిందంటూ వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డిపై బాజిరెడ్డి గోవర్ధన్ తీవ్రంగా మండిపడ్డారు. గతంలో ఎమ్మెల్సీ కవితను ఓడించేందుకు బీజేపీకి సహకరించిందే కాంగ్రెస్ పార్టీ అని గుర్తుచేశారు. లౌకిక పార్టీ అని చెప్పుకుంటూ ఫక్తు మతతత్వ పార్టీకి మద్దతు తెలిపిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులంతా గతం మాదిరిగానే ఈసారి కూడా బీజేపీకి ఓటేసి గెలిపించారని ఎద్దేవా చేశారు. ఇందులో బీఆర్‌ఎస్ తప్పిదం లేదన్నారు. కాంగ్రెస్ వాళ్లే ఆత్మహత్యాస దృశ్యం అన్నట్లుగా ఈ ఎన్నికలను మార్చుకున్నారని మండిపడ్డారు. కుమ్మక్కు రాజకీయాలతో నిజామాబాద్ వేదికగా కాంగ్రెస్, బీజేపీ పార్టీలు దొంగ నాటకాలు ఆడుతున్నాయన్నారు.

## గెలుపు ఓటములు సహజం

**-గాలి అనిల్‌కుమార్**



ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజం. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలవడం నాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి విస్తృతంగా ప్రచారం చేశాను. ప్రజలతో మమేకం అయ్యాను. నా గెలుపుకోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు చిత్తశుద్ధితో కృషి చేశారు. వారందరికీ కృతజ్ఞతలు. నా కోసం ప్రత్యేకంగా ఎన్నికల ప్రచారం చేసిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్ రావు, పోచారం శ్రీనివాసరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు.



రామారెడ్డిలో రోడ్డుపై పడిన చెట్టును తొలగిస్తున్న ట్రాక్టర్

## ఉమ్మడి జిల్లాలో వర్షం

- నేలకొరిగిన చెట్లు.. విద్యుత్ సరఫరాకు అంతరాయం
- ఎండవేడిమి నుంచి ఉపశమనం

నమస్తే తెలంగాణ యంత్రాంగం, జూన్ 4: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం మధ్యాహ్నం ఈదురుగాలులతోపాటు వర్షం కురిసింది. రామారెడ్డిలో కామారెడ్డి-భీమ్‌గల్ ప్రధాన రహదారిపై భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో ట్రాఫిక్ జామ్ కాగా.. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని రోడ్డుపై పడిన చెట్టును తొలగించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గాంధారి మండలంలోని పలు గ్రామాల్లో మధ్యాహ్నం గంటపాటు వర్షం కురిసింది. ఆర్మూర్ పట్టణంలో గాలీవాన బీభత్సం సృష్టించింది. గంటపాటు జోరు వర్షం కురిసింది. నవీపేట మండలం నాళేశ్వర్ గ్రామంలో పిడుగుపాటుకు ఓ ఆవు మృతి చెందింది. ధర్పల్లి మండలంలో కురిసిన భారీ వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఇందల్వాయి, సిరికొండ మండలాల్లో ఈదురుగాలులతోపాటు వర్షం కురిసింది. గడ్కోల్‌లో తాటిచెట్టుపై పిడుగుపడింది.



గడ్కోల్‌లో పిడుగుపడి కాలిపోతున్న తాటిచెట్టు

**కౌంటింగ్ కేంద్రం వద్ద..**

డిచ్‌పల్లి మండల కేంద్రంలోని సీఎంసీలో మంగళవారం పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ నిర్వహించిన విషయం విదితమే. కాగా మధ్యాహ్న సమయంలో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. సీఎంసీ వద్ద వేసిన టెంట్లు ఎగిరిపోయాయి. కొద్దిసేపు కారుమబ్బులు కమ్ముకోగా.. చిరుజల్లులు కురిశాయి.

సీఎంసీ వద్ద పడిపోయిన టెంట్లు



## ఏటీఎంలో చోరీ

**సుమారు రూ.25లక్షలు అపహరణ**

బాల్కొండ, జూన్ 4: బాల్కొండ మండల కేంద్రంలోని ఎస్‌బీఐ ఏటీఎంలో మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తెల్లవారుజామున 2.30గంటలకు కారులో వచ్చిన గుర్తుతెలియని దుండగులు ఎస్‌బీఐ ఏటీఎం ఎంట్రెన్స్‌లో ఉన్న సీసీ కెమెరాలకు నల్లని రంగును స్ప్రే చేశారు. ఆ తర్వాత కొద్దిసేపటికి గ్యాస్ కట్టర్‌తో వచ్చి ఏటీఎం మిషన్‌ను కట్ చేశారు. అదే సమయంలో ముంబైలో ఉన్న అధికారులకు అలర్ట్ మెస్సేజ్ వెళ్లగా అది చూసి స్థానిక అధికారులకు సమాచారం ఇచ్చారు. డయల్ 100కు సమాచారం అందించగా పోలీసులు వచ్చేలోపే ఏటీఎంలో ఉన్న రూ.24,92,600లను అపహరించుకొని పరారయ్యారు. విషయం తెలుసుకున్న ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి, రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి వివరాలను సేకరించారు. చుట్టు పక్కల ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఏటీఎం ఛానల్ మేనేజర్ నితిన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు.



ఏటీఎంలోని సీసీ కెమెరాకు చిక్కిన నిందితుడు


నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం - మన పత్రిక
విలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో అక్షర సమరం సాగించిన మన దినపత్రిక నమస్తే తెలంగాణ. బంగారు తెలంగాణ నిర్మాణంలోనూ తనదైన భూమికను పోషిస్తున్నది. ఇలాంటి చారిత్రక సందర్భంలో
నమస్తే తెలంగాణ విలేకరిగా పని చేయాలనుందా..?
అంకితభావంతో పాటు తెలుగుభాషా పరిజ్ఞానం, స్థానిక సమస్యలపై అవగాహన ఉన్నవారు పూర్తి బయోడేటాతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో రాత పరీక్షకు హాజరు కాగలరు.
: పరీక్ష తేదీ :
తేది: 07.06.2024, శుక్రవారం ఉ॥ 11.30
స్థలం : నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, పోలీస్ బెటాలియన్ వెనుక, డిచ్‌పల్లి, నిజామాబాద్
నిజామాబాద్ జిల్లాలో..
• ఎల్లమ్మగుట్ట • ముబారక్‌నగర్ • అర్సపల్లి • మోపాల్ • జక్రాన్‌పల్లి • కమ్మర్‌పల్లి • మెండోరా • సాలూరా
కామారెడ్డి జిల్లాలో..
• కలెక్టరేట్ • కామారెడ్డి టౌన్ • సదాశివనగర్ • లింగంపేట్ • తాడ్వాయి • పిట్లం • బీర్కూర్ • పాల్వంచ
వివరాలకు : 9182777737, 9182777155